ప్రజాశక్తి
www.prajasakti.com
I

కేంద్రంలో అధికారం పై కాంగ్రెస్ ధీమా

- ఎన్నికల్లో లబ్ధి కోసమే కెసిఆర్ పొలంబాట
- వర్షాలు పడకపోవడంతోనే కరువు
- చనిపోయిన రైతుల వివరాలు ఇస్తే ఆదుకుంటాం
- 6న తుక్కుగూడలో జాతీయ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల
- సభ ఏర్పాట్లు పరిశీలించిన సిఎం రేవంత్‌రెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, జూన్ 9వ తేదీన ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. రాంలీలా మైదానంలో ప్రమాణ స్వీకారానికి అందరూ ఆహ్వానితులేనని అన్నారు. ఈ నెల 6వ తేదీ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జాన జాతర సభ నిర్వహించనున్నట్టు సిఎం ప్రకటించారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి సభకు సంబంధించిన స్థలాన్ని సిఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడారు.. ఈ నెల 6వ తేదీ తుక్కుగూడలో నిర్వహించే సభలో జాతీయ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రాంతం కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రత్యేకమన్నారు. సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం చేశారని ఆరోపించారు. సూర్యాపేటలో కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి ఖండించారు. కెసిఆర్ ఇప్పటికైనా పొలం బాట పేరుతో పదేళ్ల తరువాత రైతుల వద్దకు రావడం సంతోషంగా ఉందన్నారు. అధికారం పోకుండా ఉండి ఉంటే కిందపడి గాయం కాకుండా ఉంటే, కూతురు జైలుకు వెళ్లకపోయి ఉంటే, ఆయన ఎవరికీ దొరికే వారు కాదని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది అని కెసిఆర్ అంటుండు.. ఎండాకాలంలో వర్షాలు పడతయా అని ప్రశ్నించారు. గత వర్షాకాలంలో వానలు పడలేదని, కెసిఆర్ పాపాలకు వరుణ దేవుడు కూడా భయపడి పారిపోయాడనీ చమత్కరించారు. కెసిఆర్ చేసిన పాపాలను తమపై రుద్దాలని చూడొద్దని హెచ్చరించారు. 64,75,581 మంది రైతుల ఖాతాల్లో తమ ప్రభుత్వం రైతు బంధు వేసిందని, మిగిలిన నాలుగు లక్షల మంది ఖాతాల్లో ఎన్నికల కోడ్ ముగియగానే వేస్తామని హామీ ఇచ్చారు. కెసిఆర్ సూర్యాపేట పర్యటనలో ఒక్క సెకన్ కూడా కరెంట్ పోలేదన్నారు. కెసిఆర్ ప్రెస్‌మీట్‌లో జనరేటర్ సరిగ్గా లేకుంటే తమకేమీ సంబంధమని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వంద కోట్లు రైతులకు ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు. రాష్ట్రంలో 200 మంది రైతులు చనిపోయారని కెసిఆర్ చెప్పుతున్నారని, వారి వివరాలు ప్రభుత్వానికి ఇస్తే ఆదుకుంటామని చెప్పారు.

పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కెసిఆర్ నక్కజిత్తుల వేషాలు వేసుకొని జనాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల కండ్లలో సంతోషం చూసి కేసీఆర్ నిప్పులు పోసుకుంటున్నారన్నారు. కేసీఆర్ పర్యటన చూస్తోంటే వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రలకు వెళ్లినట్లుందన్నారు. కెసిఆర్ రద్దయిన వెయ్యి రూపాయల నోటు లాంటి వారని ఎద్దేవా చేశారు. 'ప్రతి వారం కెసిఆర్ ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత నేరవేర్చాలి..' అని రేవంత్ చురకలు అట్టించారు. ఈ నెల 6న నిర్వహించే జాన జాతర సభకు రాష్ట్రంలోని నలుమూలాల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని సిఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజాపాలన

దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు, ఆత్మ గౌరవ పతాకను ఎగురవేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని చెప్పారు. బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన త్యాగాన్ని, ఆయన ఉద్యమ స్ఫూర్తిని మంగళవారం గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన నుంచి విముక్తి పొంది ప్రజా పాలన ఏర్పడేందుకు కొమరయ్య ఉద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలకు విలువనిస్తూ, స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించామనీ, మంత్రివర్గం మొదలు అన్ని నియామకాల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు.

పెండింగ్ పాల బిల్లులు చెల్లించండి

- సిఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాల ఉత్పత్తి సహకార సంఘాల పెండింగ్ బకాయిలు రూ.80 కోట్లను వెంటనే విడుదల చేయాలని సిఎం రేవంత్‌ను మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారంనాడాయన బహిరంగ లేఖ రాశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించేవారమనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.80 కోట్ల విలువైన 45 రోజుల పాల బిల్లులు పెండింగులో ఉన్నాయని పాడి రైతులు అప్పులు చేసి పశువులను కొనుగోలు చేశారనీ, బ్యాంకు కిస్తీలు కట్టలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

దాడులు ఆపండి

- తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపి, పిఎంపి, సిపిఇపి సంఘాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో ప్రాథమిక సేవలందిస్తున్న తమపై వైద్యారోగ్యశాఖ, డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు చేయకుండా నిలువరించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపి, పిఎంపి, సిపిఇసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు ఆ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకట్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు పట్టణాలు, నగరాలు వెళ్లేంత వరకు ప్రాథమిక చికిత్స అందించేది తామేనని తెలిపారు. అలాంటి తమపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తమకు అండగా ఉంటామని ఆ పార్టీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పేదలకు అండగా ఉంటున్న తమ ఆత్మస్థైర్యాన్ని దాడులతో దెబ్బతీయకుండా చూడాలని కోరారు. అదే విధంగా ప్రతి ఆర్ఎంపి, పిఎంపిలు ప్రాథమిక వైద్యానికే తమ సేవలను పరిమితం చేయాలని సూచించారు.

రైల్వేలైన్ల నిర్మాణంలో పురోగతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రైల్వే లైన్ల నిర్మాణంలో అత్యధిక పురోగతి సాధించినట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జోన్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో 39 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ల నిర్మాణం, 54 కి.మీ.గేజ్ మార్పిడి, 133 కి.మీ., రెండవ రైల్వే లైన్, 190.కి.మీ., మూడవ రైల్వే లైన్ పనులు పూర్తి చేశామని తెలిపారు. రైలు వ్యవస్థను బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాల కల్పనలో దక్షిణ మధ్య రైల్వే నిబద్ధతతో వ్యవహరిస్తుందన్నారు.

మల్కాజిగిరిలో బిఆర్ఎస్, బిజెపి మధ్యే పోటీ

- డమ్మీ అభ్యర్థిని పెట్టిన కాంగ్రెస్
- రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదు
- ఈటల రాజేందర్ కేంద్రం నుంచి రూపాయీ తేలేదు
- మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నియోజకవర్గానికి చేసిందేమీ లేదు.. బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ కేంద్రం నుంచి రూపాయి తేలేదు.. కాంగ్రెస్ నుంచి డమ్మీ అభ్యర్థిని పోటీలో పెట్టారు. అందువల్ల ఇక్కడ బిఆర్ఎస్, బిజెపి మధ్యే పోటీ ఉంటుంది" అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని సిఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మేడ్చల్ నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ బలపర్చిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. 25 సంవత్సరాలుగా రాగిడి లక్ష్మారెడ్డి అనేక ప్రజా సేవా కార్యక్రమాలు చేశారని, కేసీఆర్ గుర్తించి ఆయనకు ఎంపి టికెట్ ఇచ్చారని చెప్పారు. గతంలో ఈ ప్రాంతంలో కెసిఆర్ చేసిన అభివృద్ధే లక్ష్మారెడ్డిని గెలిపిస్తుందని చెప్పారు.

పదేళ్లలో బిజెపి ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏం చేసిందో చెప్పి ఈటల రాజేందర్ ఓట్లు అడగాలన్నారు. రుణమాఫీ చేయలేదని ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని.. ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే కెసిఆర్ రూ.16 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. తూంకుంట నుంచి జెబిఎస్ వరకు, గుండ్ల పోచంపల్లి నుంచి ప్యారడైస్ వరకు స్కైవే కోసం అనేక సంవత్సరాలుగా బిఆర్ఎస్ కృషి చేసిందని, ఆ ఫలితమే ఇటీవల దానికి ఆర్డర్ కాపీ వచ్చిందని తెలిపారు. అయితే, దానిని తానే సాధించినట్టు సిఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో లక్షా 62,283 మందికి ఉద్యోగాలు ఇచ్చామని.. ఇన్ని ఉద్యోగాలు ఏ రాష్ట్రంలోనూ ఇవ్వలేదని చెప్పారు. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోయామన్నారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి.. అసలు మీరు ఎప్పుడు నోటిఫికేషన్ వేశారని ప్రశ్నించారు. మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న మాట నిలుపుకోవాలని సూచించారు. అలాగే రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ, నెల నెలా మహిళలకు ఇస్తానన్న రూ.2,500 ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీ అయినవాళు కాంగ్రెస్‌కు ఓటు వెయ్యాలని.. మిగతా వాళ్ల బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు.

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. దమ్మున్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని, కాంగ్రెస్, బిజెపికి క్యాడర్ లేదని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక ఇళ్లు, ఫంక్షన్ హాళ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి రావాలని.. లేదా మీరు కట్టుకున్న బిల్డింగ్‌లు కూలగొడతామని కాంగ్రెస్ వారు బెదిరిస్తున్నారని తెలిపారు. లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను 25 సంవత్సరాలుగా సేవాకార్యక్రమాలు చేస్తున్నానని, అది గుర్తించి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చారని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ రంగం అభివృద్ధి ఘనత కేటీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలకు వారంటీ లేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జడ్‌పి వైస్ చైర్మన్ వెంకటేష్, ఎంపిపి ఎల్లుభాయిబాబు, జడ్‌పిటిసి అనితలాలయ్య, బిఆర్ఎస్ పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు

రైతుల పట్ల బిజెపి, బిఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

- ఐదేళ్లు ఎక్కడున్నావ్ బండి సంజయ్..
- విభజన హామీలు అమలు ఏమైంది : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదేండ్ల కాలంలో నష్టపోయిన రైతాంగాన్ని ఏనాడు ఆదుకొని బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ఉదయం మార్నింగ్ వాక్ చేశారు. వార్డుల్లోని సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న బండి సంజయ్.. ఎప్పుడూ ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు రావడంతో బిజెపి, బీఆర్ఎస్‌కు రైతుల బాధలు గుర్తుకొస్తున్నాయని ఆరోపించారు. బండి సంజయ్ రాష్ట్రంలో దీక్ష చేయడం కంటే రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఢిల్లీ వెళ్లి నరేంద్ర మోడీ దగ్గర దీక్ష చేయాలని సూచించారు. వర్షాకాలంలో వర్షాలు పడలేదని, గ్రౌండ్ లెవెల్ వాటర్ పడిపోతున్నాయని, అందుకే నీటి ఎద్దడి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందన్న వ్యక్తులు కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో ఓట్ల కోసం మొన్నటి దాక రాముడి ఫొటో పెట్టుకుని నరేంద్ర మోడీ ఫొటో బంద్ చేశారన్నారు. కాళేశ్వరం మునిగితే, కుంగితే సలహాలు ఇవ్వని కేసీఆర్.. పొలాల బాట పట్టారన్నారు. కరువును రాజకీయం చేస్తూ రైతులను రెచ్చగొడుతూ రైతుల పొలాల దగ్గర రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్‌తో కలిసొస్తే ప్రధానమంత్రి దగ్గర ప్రకృతి వైపరీత్యం సహకారం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వానికి సహకరించి కేంద్రంపై ఒత్తిడి తెద్దామని తెలిపారు. అనంతరం హుస్నాబాద్ పట్టణం ఆరేపల్లిలో ఇటీవల మరణించిన కాశబోయిన ప్రభాకర్ కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, మండల అధ్యక్షులు బంక చందు, మడప జైపాల్ రెడ్డి, చిత్తారి రవీందర్ అక్కు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు ఐటి ఉద్యోగుల కృషి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయిస్ సంస్థ (ఎఫ్ఐటిఇ) కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారంనాడిక్కడి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల్లోని ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రశ్నించే గొంతు పార్లమెంటులో ఉండాలి

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ
- భువనగిరి ఎంపి అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి : మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే గొంతు పార్లమెంటులో ఉండాలని, అందుకు సిపిఎం భువనగిరి ఎంపి అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో వుల్లంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగిన పార్టీ శాఖ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి హిందుత్వం పేరుతో బిజెపి ప్రభుత్వం పబ్బం గడుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే విధంగా మోడీ విధానాలున్నాయని వివరించారు. ఎన్నో ఏళ్లుగా బడుగు బలహీన, కార్మిక, రైతాంగ సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి నరసవ్వ, కానుగుల రాజు, సున్నం యాదగిరి, దయ్యాల పోశయ్య, కర్రోళ్ల ఎల్లయ్య, దండు రవి, తేలు నవనీత, మంజుల, కనుకవ్వ, లింగవ్వ, ఇందిరా, బీడీ, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిఇఒ వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిఎస్‌యుటిఎఫ్ నాయకులు

పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించండి

- ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి
- సిఇఒ వికాస్‌రాజ్‌కు టిఎస్‌యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలు కల్పించి, ఎన్నికలు సజావుగా సాగటానికి చర్యలు తీసుకోవా లని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) ఎన్నికల కమిషన్ (ఇసి)ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వికాస్‌రాజ్‌ను టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి మంళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, లేదంటే 800 మంది ఓటర్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కూ ఒక అదనపు పోలింగ్ అధికారిని కేటాయించాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఆహారం, కనీస సౌకర్యాలు కల్పించడానికి కఠినమైన ఆదేశాలను జారీ చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోని పిఒలు, ఎపిఒలు, ఒపిఒలకు ఏకరూప వేతనం చెల్లించాలని సూచించారు. గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని నియోజకవర్గాల్లో రూ.2,400 అంతకంటే ఎక్కువ చెల్లించగా, కొన్నింటిలో రూ.1,600 చెల్లించారని గుర్తు చేశారు. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అశాంతి నెలకొందని తెలిపారు. వచ్చేనెల 13న రిసెప్షన్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బందికి వారి నివాస స్థలాలకు రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నవారు, శారీరకంగా వైకల్యం ఉన్న వారు, ఏడాదిలోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయించాలనీ, జిల్లా ఎన్నికల అధికారుల (డిఇఒ)కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అర్హత కలిగిన పోలింగ్ సిబ్బంది అందరికీ తుది శిక్షణా తరగతి రోజే పోస్టల్ బ్యాలెట్ అందజేసి ఓటు హక్కును వినియోగించుకుంఎ అవకాశం కలిగించాలని సూచించారు. ఈ అంశాలను పరిశీలించి, డిఇఒలకు అవసరమైన సూచనలను జారీ చేయాలని తెలిపారు.

సు'జలం'.. వ్యర్థమయం

- నెం.1 పారిశ్రామికవేత్త వెదజల్లుతున్న కాలుష్యం
- వైరా రిజర్వాయర్‌కు పారాబాయిల్డ్ రైస్‌మిల్లు కలుషితాలు
- కాలుష్య కారకంగా అక్రమ ఆక్వాఫామ్ నిర్వహణ
- ఖమ్మం బిలీఫ్ హాస్పిటల్ నిర్వాహకుల లీలలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోనే నెంబర్ 1 మహిళా పారిశ్రామిక వేత్తగా తనకు తానుగా చెప్పుకునే ఖమ్మంలోని బిలీఫ్ హాస్పిటల్ నిర్వాహకులు రమాజ్యోతి ఆగడాలు 'శృతి'మించుతున్నా యని పలువురు అంటున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ..ఎవరు అధికారంలో ఉంటే వారితో అంటకాగుతూ 'ఆడిందే ఆట' అనే రీతిలో ఆమె చేసే అక్రమ చర్యలతో కొణిజర్ల మండలంలోని పలువురు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఖమ్మంలోని బిలీఫ్ హాస్పిటల్ మొదలు.. కొణిజర్ల మండలంలోని పారాబాయిల్డ్ రైస్‌మిల్, ఆక్వా ఫామ్ వరకు ఆమె అనేకరకాలుగా ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తున్నారనే ప్రచారం ఉంది. ముఖ్యంగా రైస్‌మిల్, ఆక్వాఫామ్ వ్యర్థాలను స్థానికంగా ఉన్న వాగుల్లోకి వదులుతుండటం తో ఆ నీరు వైరా రిజర్వాయర్‌లోకి వెళ్తోంది. సుమారు 90కి పైగా పంచాయతీలకు తాగునీరు అందించే బోడేపూడి సుజల స్రవంతి పథకానికి సైతం వైరా జలాశయం నీరు వినియోగిస్తుండటంతో ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూ ఆక్రమణలు, అనుమతుల్లేని నిర్మాణాలు, ఆదాయ వ్యవహారాల్లోనూ అవకతవకలు, హాస్పిటల్ నిర్వహణలోనూ నేచురల్ డెలివరీ, కృత్రిమ గర్భధారణ పేరుతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తారనే ఆరోపణలు హాస్పిటల్‌పై ఉన్నాయి. ఇలా ఎన్నోఅడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతూ నాడు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో.. నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సన్నిహితంగా మెలుగుతూ.. ఎంతో చాకచక్యంగా తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటారని చెబుతుంటారు. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేయడం ఈ నెం.1 మహిళా పారిశ్రామిక వేత్త లక్షణంగా పలువురు అభివర్ణిస్తున్నారు.

పగిడేరులోకి పాడు నీరు..

కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలో ఎస్ఎఆర్ పారాబాయిల్డ్ రైస్ మిల్‌ను రమాజ్యోతి రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ మిల్లు నుంచి వ్యర్థాలు చుట్టుపక్కలున్న రైతుల పొలాల్లోకి వదులుతున్నారు. పొలాల్లో నుంచి వ్యర్థపు నీరు పక్కనున్న పగిడేరు వాగులోకి చేరుతోంది. ప్రస్తుతం మిల్లు నుంచి వచ్చే వ్యర్థాల ప్రవాహం అధికంగా ఉండటంతో నేరుగా పైప్‌లైన్ వేసి పగిడేరులోకి వదులుతున్నారు. దీనివల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. రైతులు ప్రశ్నించడంతో వారిని ఇష్టానుసారంగా మిల్లు యజమాని దూషిస్తున్నారు. ఒకరిద్దరు రైతులపై చేయిచేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ వ్యర్థపు నీరు పగిడేరులో కలుస్తుంది. అక్కడి నుంచి నీరంతా వైరా రిజర్వాయర్‌కు చేరుతుంది. జలాశయం ఆధారంగా నిర్వహించే బోడేపూడి సుజల స్రవంతి తాగునీటి పథకానికి ఈ రసాయన నీరు వెళ్తున్నాయి. ఈ నీరు తాగిన మూగజీవాలు సైతం అస్వస్థతకు గురవుతున్నాయి. దీనిపై స్థానికులు వాగ్వాదానికి దిగినా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ మిల్లు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆ ప్రాంతమంతా సుమారు రెండు కిమీ దూరం వరకు దుర్వాసన సైతం వస్తోంది. 5.30 ఎకరాల భూమిలో ఉన్న పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో కేవలం 30 కుంటలు మాత్రమే కన్వర్షన్ అయింది. మిగిలిన ఐదు ఎకరాలు అక్రమ పద్ధతిలో మిల్లు నిర్వహణ కోసం వినియోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తన పారాబాయిల్డ్ రైస్‌మిల్ వ్యర్థాలను వాగులోకి వదిలి నీటి కాలుష్యానికి కారణమవుతున్న ఈ నెం.1 పారిశ్రామిక వేత్త పర్యావరణ పరిరక్షణకు పిలుపునిస్తుండటం విస్తుగొల్పుతోంది. ఇంతేకాదు, రైస్‌మిల్లులో పనిచేసే సుమారు 60మంది బయటి రాష్ట్రాల కార్మికులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు రమాజ్యోతిపై ఆరోపణలున్నాయి. తన మాట వినని వారిని చిత్రహింసలకు గురిచేస్తోందని ప్రత్యక్షసాక్ష్యులు చెబుతుంటారు.

ఆక్వాఫామ్‌తో ఆందోళన..

కొణిజర్ల మండలంలోనే గుబ్బగుర్తి సమీపంలో ఆక్వా ఫామ్ సైతం ఈమె నిర్వహిస్తున్నారు. 80 ఎకరాల్లో చేపట్టిన ఈ రొయ్యల పామ్ నుంచి నీరు బయటకు వదులుతున్నారు. ఈ కలుషిత నీరు స్థానికంగా ఉన్న అంజనాపురం ఏరులోకి చేరుతోంది. ఆ నీరు కూడా వైరా రిజర్వాయర్‌కు వస్తున్నాయి. అటు రైస్‌మిల్.. ఇటు ఆక్వాఫామ్ వ్యర్థాలన్నీ వైరా రిజర్వాయర్‌లోనే కలుస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నీరు దుర్వాసన వస్తున్నాయి.. - షేక్ ఖాసీం, రైతుసంఘం రాష్ట్ర నాయకులు

ఈ ప్రాంతంలోని ఏరునీరు దుర్వాసన వస్తుంది. ఈ నీటిని తాగిన మూగజీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయి. వైరా బోడేపూడి సుజల స్రవంతికి కూడా ఈ నీరే వినియోగిస్తుండటంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు కూడా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు పరిసరాల్లోని రైతుల వడ్లను తరుగు, కోత లేకుండా తీసుకుంటుండటంతో ఏమి చేయలేని పరిస్థితి. అయినా కొందరు రైతులు ప్రశ్నిస్తే మిల్లు యజమాని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL DISTRICT JUDGE-CUM-VI ADDITIONAL MSJ-CUM-FAMILY COURT, RANGA REDDY DISTRICT AT: KUKATPALLY
O.S.No. 107 OF 2020

Between:
Smt. G.Buchamma …Plaintiff
AND
T.Naga Raju and another …Defendants

To,
1.T.Naga Raju, S/o. Late Narayana Swamy, Aged about 74 Years, Occ:Business, R/o.H.No.14-276/4, Panchali Nagar, Thukivakam Village, Renigunta Mandal, Chitoor District.
2.P.Anji Babu Yadav, S/o. Late P.Swamy, Aged about 39 Years, Occ:Business, R/o.H.No.8-3-836/1, Yellareddy guda, Sri Nagar Colony, Hyderabad.

Please take notice that the Plaintiff have instituted the Suit for Recovery of an amount of Rs.1,00,18,560/- (Rupees One Crore Eighteen Lakhs Five Hundred Sixty Only) along with interest @ 24% per month @ Rs. 1,78,150/- which comes to Rs.16,03,350/- (Rupees Sixteen Lakhs Three Hundred Fifty Only) from 17.07.2019 to 17.03.2020, thus the total amount comes to Rs.1,16,21,910/- (One Crore Sixteen Lakhs Twenty One Thousand Nine Hundred and Ten Rupees Only) for causing the hardship damages and mental agony against T.Naga Raju and P.Anji Babu Yadav with O.S.No. 107 of 2020 before the Hon'ble VI Additional District Judge-cum-VI Additional MSJ-cum-Family Court, Ranga Reddy, District at Kukatpally and the 2 Plaintiff had deposited the process for appearance of T.Naga Raju and P.Anji Babu Yadav for number of times and who have knowledge about the pendency of the above Suit. The Hon'ble Court pleased to order for Publication in the esteemed Daily newspaper for your appearance on 23.04.2024 at 10.30 AM or the Hon'ble Court shall take the necessary proceedings in due course if failed to appear before the Hon'ble Court, the matter will be adjudicated on merits.

M/S.JAYABHARATH REDDY,
Advocates,
Flat No.601, PRP Residency,
Pragathi Nagar, SBI Colony,
L.B.Nagar, Hyderabad – 500 068
Ph. No.90100 44288

అవకాశవాదులను చిత్తుగా ఓడించాలి

- బిజెపిలో ఉంటే నీతిపరులు.. లేదంటే అవినీతిపరులా ?
- భువనగిరిలో సిపిఎం అభ్యర్థిని గెలిపించండి
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవకాశవాద పార్టీలను పార్లమెంట్ ఎన్నికలో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఎండి జహంగీర్ గెలుపును కాంక్షిస్తూ సిపిఎం మునుగోడు నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గట్టు శ్రీరాములు ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి, బండ శ్రీశైలం అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ దేశంలో పదేళ్ల నరేంద్రమోడీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించారని చెప్పారు. ధరల మీద ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచారన్నారు. బిజెపిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రూ. 50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ కంపెనీలను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టడం, ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేసేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా ముద్ర వేస్తూ.. ప్రతిపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఇడి, ఐటి దాడులు చేయిస్తోందన్నారు. బిజెపిలో ఉన్నంత అవినీతిపరులు మరే పార్టీలో లేరని చెప్పారు. బిజెపిలోకి పోతే నీతిపరులవుతారు.. లేకుంటే అవినీతి పరులా అని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల అవినీతికి పాల్పడింది బిజెపి కాదా అని ప్రశ్నించారు. బిజెపికి ఓటు వేయాలని వస్తే ఊరి బయటి నుండే వెళ్లగొట్టాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రతి కార్యకర్త పార్టీ ప్రతిష్టను పెంచేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. జహంగీర్‌కు అత్యధికంగా ఓట్లు వేయించి నైతిక విజయం సాధించాలన్నారు. అమరవీరుల ఫొటోల సాక్షిగా కమ్యూనిస్టుల ఓట్లు కమ్యూనిస్టులకే వేసుకుందామని ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

భువనగిరి కమ్యూనిస్టుల ఉద్యమాలకు పుట్టినిల్లు
సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్

భువనగిరి కమ్యూనిస్టు ఉద్యమాలకు పుట్టినిల్లు అని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. ఈ ప్రాంతంలో ఏ చెట్టును, ఏ గుట్టను కదిలించినా దానికో పోరాట చరిత్ర ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో ఎర్రజెండా కనబడుతుందని చెప్పారు. మునుగోడులో కందాల రంగారెడ్డి, నకిరేకల్‌లో నర్రా రాఘవరెడ్డి, తుంగతుర్తిలో భీమ్‌రెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, జనగామలో ఏసిరెడ్డి నర్సింహారెడ్డి, ఆలేరులో ఆరుట్ల రామచంద్రారెడ్డి, సుశీల, దుంపల మల్లారెడ్డి, భువనగిరిలో రావి నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నంలో కొండిగాని రాములు, ముస్కు నర్సింహా ప్రజల మనసులో చెరగని ముద్ర వేశారన్నారు. మహోన్నతులను కన్న ఈ నేలపై సిపిఎం పోటీ చేమల్ల, దేవాదుల ప్రాజెక్టులను పూర్తిచేసే విధంగా పనిచేస్తానన్నారు. విద్య, వైద్యం సమస్యలతో సతమత మవుతున్న ఈ ప్రాంత ప్రజల కోసం పోరాడుతానన్నారు. కమ్యూనిస్టులది ఉద్యమ చరిత్ర అన్నారు. మిగతా పార్టీలది బతుకు చరిత్ర అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీశ్, బట్టుపల్లి అనురాధ, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహా, సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, నల్లగొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, చౌటుప్పల్ మండల, మున్సిపల్ కార్యదర్శులు గంగదేవి సైదులు, బండారు నర్సింహా పాల్గొన్నారు.

ఫ్యూచర్ బ్యాంకింగ్‌పై బిఒఎం సెమినార్

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) 'ఫ్యూచర్ బ్యాంకింగ్'పై ఆల్ ఇండియా హిందీ సెమినార్‌ను నిర్వహించినట్లు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా అన్ని శాఖల్లో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భాషా మంత్రిత్వ శాఖ సెక్రటరీ అన్షులి ఆర్యా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిఒఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే, జనరల్ మేనేజర్ చిత్ర డాటర్, కె రాజేష్ కుమార తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఒఎం హిందీ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు.

ఉపాధ్యాయ సంఘ నేతలపై అక్రమ కేసులను ఎత్తేయాలి

- యుఎస్‌పిసి, జాక్టో డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ సంఘ నేతలపై గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసును ఎత్తేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పిఆర్‌సి అమలు చేయాలని, పదోన్నతులు చేపట్టాలని కోరుతూ 2020, డిసెంబర్ 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో యుఎస్‌పిసి, జాక్టో ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించిన సందర్భంగా యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, టి లింగారెడ్డి, జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్‌పై పోలీసులు అక్రమంగా క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఆ కేసును ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసుల ముందస్తు అనుమతితో శాంతియుతంగా ధర్నా జరిగినప్పటికీ అనుమతించిన సంఖ్యకు మించి ఉపాధ్యాయులు ఎక్కువ హాజరయ్యారనే అక్కసుతో నాయకులపై ఆనాటి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పూనుకున్నదని తెలిపారు. ప్రతినెలా రెండు రోజులు కోర్టు వాయిదాలకు తిరగాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఆ కేసును ఎత్తేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు యూఎస్‌పీసీ, జాక్టో పక్షాన వినతిపత్రాలను సమర్పించినా ఇంకా చర్యతీసుకోలేదని తెలిపారు. అక్రమంగా బనాయించిన ఆ కేసును వెంటనే ఎత్తేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కల్తీ కల్లు తాగి ఆరుగురికి అస్వస్థత

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీ కల్లు తాగి ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో మంగళవారం జరిగింది. అస్వస్థతకు గురైన సురేష్, ప్రకాష్, తిరుపతి, శ్రీనివాస్, రాజు, రాజును గ్రామస్తులు వేములవాడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. డిఎస్‌పి నాగేంద్రాచారి, రూరల్ ఎస్ఐ మారుతి ఆస్పత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వ కాలంలో దీర్ఘకాలికంగా ఆర్టీసీలో పనిచేసి స్వల్పకారణాలతో తొలగించబడిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు వంటి వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 1,500 పైగా చిన్నచిన్న ఉద్యోగులను స్వల్పకారణాలతో విధుల నుంచి తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించిన ఆర్టీసీ కార్మికులందరూ సుమారు ఐదు నుంచి 20 ఏళ్లపాటు నిరంతరంగా సంస్థ కోసం సేవలందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో బస్సుల కండిషన్‌లు, టికెట్ల మిషన్‌లు వంటి వాటిని సరైన రీతిలో నిర్వహించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ఈ తప్పిందాలకు చిన్నచిన్న ఉద్యోగులను బాధ్యులుగా చేయడం విచారకరమని పేర్కొన్నారు. ఆర్‌టిసిలో భర్తీ చేయాల్సిన పోస్టులున్నాయని, వాటిలో ఈ తొలగించబడిన ఉద్యోగులను భర్తీచేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

పంటల బీమా పథకానికి క్యాబినెట్ ఆమోదం

- పంటలు ఎండనివ్వం.. ప్రతి గింజా కొంటాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

గతంలో పంట బీమా ఇన్సూరెన్స్ పథకం ఉండేదని మళ్లీ ఈ పథకాన్ని పునర్ ప్రవేశపెట్టడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు, పినపాక, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, భద్రాచలం ఎంఎల్‌ఏలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, రామచంద్ర నాయక్, దొంతి మాధవరెడ్డి, మురళీనాయక్, తెల్లం వెంకటరావు, పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇన్సూరెన్స్ పథకం ద్వారా వైపరీత్యాలు వచ్చిన సందర్భాల్లో పరిహారాలు అందుతాయన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేస్తుందన్నారు. పంటలు ఎండిపోకుండా బోర్లు ఇతర మార్గాల ద్వారా నీరందించడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రబీ సీజన్‌లో ప్రతి గింజా కొంటామన్నారు. దీనికై రాష్ట్రంలో 7,145 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు రైతు బంధు 92.36 శాతం బ్యాంక్ ఎకౌంట్‌లో జమయిందని తెలిపారు. మిగతావి త్వరలో జమకానున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల తొలి బహిరంగ సభ హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల ఆరున భారీ ఎత్తున జరగనుందని తెలిపారు. రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణంలో జరిగే సభలోనే జాతీయ స్థాయి ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, జాతీయ నాయకులు రాహుల్, ప్రియాంక గాంధీ రానున్నారని తెలిపారు.

నియోజకవర్గ ఎన్నికల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కెసిఆర్‌వి అబద్ధాలు...

మాజీ సిఎం కెసిఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మంత్రి తుమ్మల అన్నారు. ఇప్పటికి అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం వల్ల ఆయన స్థాయి తగ్గించుకున్నారన్నారు. ఉన్న గౌరవాన్ని నిలుపుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని తొమ్మిదేళ్లు పాలించి ఏ రంగంలోనా అభివృద్ధి చేయకుండా భ్రష్టుపట్టించారని విమర్శించారు. విద్యుత్, నీటిపారుదల ప్రాజెక్టులు, ఆర్థిక వనరులు అన్ని నాశనం చేశారని తెలిపారు. వర్షాకాలంలో నీరివ్వనోళ్లు మండుతున్న ఎండకాలంలో నీళ్లేవి అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలే అయినప్పటికీ వారు చేసిన తప్పులన్నీ తమపై రుద్దాలని చూస్తున్నారని ఇది తగదని అన్నారు. వారి పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని, తాము అధికారంలో ఉన్నా ఎన్ని ఇబ్బందులు ఏర్పడినా ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని స్పష్టంచేశారు.

24 గంటల్లో కూడవెల్లి వాగుకు నీళ్లు విడుదల చేయాలి

- లేకుంటే మేమే గేట్లు ఎత్తుతాం
- ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

దుబ్బాక నియోజకవర్గంలోని కూడవెల్లి వాగుకు వెంటనే నీళు విడుదల చేయాలని, మంత్రులు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తమ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తీసుకెళ్లారని, 24 గంటల్లో వాగుకు నీళ్లు విడుదల చేయని పక్షంలో మల్లన్న సాగర్‌ను ముట్టడించి, తామే.. గేట్లు ఎత్తుతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరికి బిఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి బోగస్ మాటలను పక్కనపెట్టి రైతులు పండించిన పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ పొలం బాట పట్టిన తరువాతనే కాంగ్రెస్ ప్రభుత్వం పంటల విషయంలో కళ్లు తెరిచిందన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని తెలిపారు. కెసిఆర్ ఈ నెల ఐదున కరీంనగర్‌కు వెళ్తున్నారని, అందుకే ప్రభుత్వం గాయత్రి పంప్ హౌజ్ నుంచి నీరును ఎత్తిపోస్తున్నారని, నాగార్జునసాగర్ కాలువ నుంచి నీటిని విడుదల చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నీటి నిర్వహణ, విద్యుత్ వైఫల్యం వల్లే పంట నష్టం జరిగిందని తెలిపారు. దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టుగా ఉంది సర్కారు తీరు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన, వడగళ్ల వానకు నష్టపోయిన పంటలకు రూ.25 వేల నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల రుణమాఫీ, రూ.15000ల రైతుబంధు, పంటలకు రూ.500 బోనస్ పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను దగా చేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క మంచి పని కూడా చేయకుండా పథకాల్లో కోతలు పెట్టి వికృత ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 మంది రైతుల ఆత్మహత్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అవహేళనగా మాట్లాడటం సరికాదన్నారు. విపక్ష పార్టీ నాయకులపై కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ రైతులను ఆదుకోవడంపై కాంగ్రెస్‌కు లేదని ఫైర్ అయ్యారు. కెసిఆర్ హయాంలో ఒక్క ఎకరా ఎండలేదని, కాంగ్రెస్ వచ్చాకే పంటలు ఎండుతున్నాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలుపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ మంత్రులకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్ పర్సన్ రోజా రాధాకష్ణ శర్మ, బిఆర్ఎస్ నాయకులు నాగిరెడ్డి, గుండు భూపేష్, రాజనర్సు, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాణిక్య రెడ్డి, బాలమల్లు, సారయ్య, సోమిరెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేస్తున్న హరీశ్‌రావు

తరతరాలకు స్ఫూర్తి సర్వాయి పాపన్న

- బిసి వెల్ఫేర్ కమిషనర్ బాల మాయదేవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తరతరాలకు స్ఫూర్తి సర్వాయి పాపన్న అని బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల నుంచి నాయకుడిగా ఎదిగిన సర్వాయి పాపన్న చరిత్ర ఎంతో గొప్పదని ఆమె కొనియాడారు. తెలంగాణ నాయకుడైన పాపన్న చరిత్ర దేశ విదేశాల్లో అక్షరీకరించారన్నారు. విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో సర్దార్ పాపన్న శాశ్వత శిలావిగ్రహం ఏర్పాటు చేయడం, ప్రజల కోసం ఆయన చేసిన పోరాటానికి నిదర్శనమని ఆమె ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, ఎంబిసి సిఇఒ అలోక్ కుమార్, బిసి సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి ఎదిగితే బిఆర్ఎస్ బలాన్ని కోల్పోవడం ఖాయం

- నియోజకవర్గ అభివృద్ధికే అధికార పార్టీలోకి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిజెపి బలపడితే బిఆర్ఎస్ బలాన్ని కోల్పోయి ప్రమాదంలో పడాల్సిన పరిస్థితి లేకపోలేదని కాంగ్రెస్ నేత, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి బలంగా దూసుకొస్తోందని, అది తెలంగాణ అభివృద్ధికి ఏ రకంగానూ మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని మతాలవారు ఐక్యంగా ఉంటున్నారని, రాజ్యాంగ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న బిజెపికి ఓటు వేయమని అడుగుతున్న మంద కృష్ణను కోరేది ఒక్కటేనని, తనపై కోపముంటే ఉండొచ్చుగాక, అంబేద్కర్ వాదాన్ని విడిచి, మనువాదాన్ని ప్రోత్సహించవద్దని సూచించారు. మనువాదాన్ని ప్రోత్సహిస్తూ అంబేద్కర్ వాదాన్ని తొక్కి పట్టి దళితవాదాన్ని అణిచివేస్తూ, రిజర్వేషన్లను ఎత్తివేసి ఆగం చేయాలని చూస్తున్న బిజెపిని ఎలా నమ్ముతున్నారని ప్రశ్నించారు. మంద కృష్ణ నినాదం, విధానం సరైంది కాదని, దళిత సమాజం క్షమించదని అన్నారు. తన పక్కనే ఉండి కూడా నేడు ప్రజలకోసం తీసుకున్న నిర్ణయంపై అక్కసు వెళ్లగాక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఎంపీ అయ్యానని, జనవరి 2017లో కేసీఆర్ పిలిచి ఈ రాష్ట్రానికి తెలంగాణ అభివృద్ధికి తన అవసరమని చెబితే డిప్యూటీ సీఎం చేశారని అన్నారు. 2024లో ఎఐసిసి, పిసిసి కాంగ్రెస్‌లో చేరమని ఆహ్వానించి అవకాశం ఇస్తే వెళ్లానని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించి తన కూతురు కడియం కావ్యం ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఆయన వెంట ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కడియం అభిమానులు, ప్రజా, పార్టీ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరు పదో తరగతి విద్యార్థుల మృతి
- జహీరాబాద్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంతో వచ్చిన ఓ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృతి చెందారు. మొన్నటి వరకు పరీక్షలు రాసిన వారిద్దరూ.. పరీక్షలు పూర్తయిన రెండ్రోజులకే ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జీ వద్ద మంగళవారం ఉదయం జరిగింది. జహీరాబాద్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మోమిన్ మహిలకు చెందిన వరుసకు అన్నదమ్ములయ్యే యువకులు.. రిహాన్ (18), ఆదిల్ (16).. మంగళవారం బైక్‌పై వెళ్తుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జి బాగా రెడ్డి విగ్రహం వద్ద ఆర్‌టిఎ చెక్‌పోస్ట్ నుంచి అతివేగంగా వస్తున్న లారీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో రిహాన్‌కు ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రిహాన్ మృతి చెందాడు. దీంతో విద్యార్థులు భారీ సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. దాంతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంలా మారింది. కాగా మృతదేహాలను స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న డిఎస్‌పి రామ్మోహన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ప్రధానంగా ఆర్టీఏ చెక్‌పోస్ట్ నుంచి వస్తున్న వాహనాలు, రాంనగర్ వైపు దారి మళ్లిస్తున్న వాహనాలు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు డిఎస్‌పి తెలిపారు. ఆయన వెంట సిఐ రవి, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలకు నిలయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి..

రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్టీఏ చెక్‌పోస్ట్ నుంచి వస్తున్న వాహనదారులకు.. ఈ ఓవర్ బ్రిడ్జి వద్ద క్రాసింగ్ చేస్తున్న వాహనాలు.. దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని వివిధ వార్డులతోపాటు శివాజీ విగ్రహం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు ద్విచక్ర వాహనాలపై జాతీయ రహదారిపైకి వెళ్తుంటారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వాయి పాపన్న 314వ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంవి రమణ

శ్రామిక రాజ్య స్థాపనే సర్వాయి పాపన్నకు నివాళి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రామిక రాజ్య స్థాపనే సర్వాయి పాపన్నకు నివాళి అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతి సభను మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న బహుజనుల రాజ్యస్థాపన కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. శ్రామిక రాజ్య స్థాపన లక్ష్యంగా పని చేసిన యోధుడని కొనియాడారు. పెద్దల నుంచి తీసుకుని పేదలకు పంచిన మహనీయుడని, ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. నేడు కష్టజీవుల శ్రమను దోచుకుంటున్న ధనవంతులు, కోటీశ్వరులు రాజ్యం ఏలుతున్నారని, అవినీతి, అక్రమాలు పెరిగిపోయి రాజకీయ నాయకులు కలుషితమవుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఛీ కొట్టాల్సిన రాజకీయ పార్టీలు అక్కున చేర్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చొక్కాలు మార్చినంత సులభంగా పార్టీలు మారుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. "పోరాడే వాడే పరిపాలనకు అర్హుడు" అని పోరాడి నిరూపించిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని చెప్పారు. సకలజన సైన్యాన్ని కలుపుకొని శ్రామిక రాజ్యం కోసం పోరుసల్పి వీర మరణం పొందారని.. వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయకుమార్, టిపిఎస్‌కె రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జి.రాములు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం సీనియర్ నాయకులు అబ్బగాని భిక్షం, కెజికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, ఎం కృష్ణ స్వామి, ప్రభాకర్, పొన్నం రాజయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సన్ ఫ్లవర్ చమురు దిగుమతులు

- తగ్గిన పామాయిల్ సరఫరా

న్యూఢిల్లీ : భారత్‌కు పామాయిల్ దిగుమతులు పడిపోవడంతో.. సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా వంట నూనెల దిగుమతులు పెరిగాయి. సన్‌ఫ్లవర్ వంట నూనె దిగుమతులు ఫిబ్రవరితో పోల్చితే గడిచిన మార్చిలో 51 శాతం పెరిగాయని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇంత గరిష్ట స్థాయిలో పెరగడం రెండవ సారి. ప్రత్యర్థి పామాయిల్ కొనుగోలును తగ్గించడంతో పాటు తక్కువ ధరలో ఇతర వంట నూనెల కొనుగోళ్లను పెంచడానికి దారి తీసిందని.. మలేషియాను ఉద్దేశించి ఐదుగురు డీలర్లు పేర్కొన్నట్లు రాయిటర్స్ తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద కూరగాయల నూనెల దిగుమతిదారుగా ఉన్న భారత్ పామాయిల్ కొనుగోళ్లను తగ్గించడంతో అత్యధికంగా ట్రేడ్ అవుతున్న మలేషియా పామాయిల్ ఫ్యూచర్స్‌లో ర్యాలీని పరిమితం చేయగలదని నిపుణులు భావిస్తున్నారు. డీలర్ల అంచనాల ప్రకారం.. గడిచిన మార్చిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు నెలవారీగా 51 శాతం పెరిగి 4,48,000 మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. పామాయిల్ దిగుమతులు 3.3 శాతం తగ్గి 4,81,000 టన్నులకు పరిమితమయ్యాయి. ఇది మే 2023 నాటి అతి కనిష్ట స్థాయి."పామాయిల్ స్థానంలో పొద్దు తిరుగుడు నూనె దిగుమతులు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ఉత్పత్తి సమస్యలు పామాయిల్ ధరలను దృఢంగా ఉంచుతున్నాయి. కొనుగోలుదారులు సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు మారేలా చేస్తున్నాయి". అని వెజిటేబుల్ ఆయిల్ బ్రోకరేజీ సంస్థ సన్‌విన్ గ్రూప్ సిఇఒ సందీప్ బజోరియా పేర్కొన్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు చాలా పోటీగా ఉన్నాయని, ఏప్రిల్, మే నెలల్లో కూడా అధిక దిగుమతులు ఉండొచ్చని ఎడిబుల్ ఆయిల్ ట్రేడర్, బ్రోకర్ జిజిఎ రీసెర్చ్ మేనేజింగ్ భాగస్వామి రాజేష్ పటేల్ తెలిపారు. భారత్ ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, థాయిలాండ్ నుండి పామాయిల్ కొనుగోలు చేస్తుంది. మరోవైపు అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుండి సోయా, పొద్దుతిరుగుడు నూనెను దిగుమతి చేసుకుంటుంది.

హిండ్‌వేర్ నుంచి ఆక్వా ప్రో వాటర్ సేవింగ్ సొల్యూషన్స్

న్యూఢిల్లీ : ప్రముఖ బాత్‌వేర్ బ్రాండ్ అయిన హిండ్‌వేర్ 'ఆక్వా ప్రో వాటర్ సేవింగ్ సొల్యూషన్స్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో మూడు అధునాతన స్ప్రే మోడ్ నాజిల్‌లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. వీటితో 98 శాతం వరకు నీటిని పొదుపు చేయడానికి వీలుందని పేర్కొంది. ఈ వినూత్న పరిష్కారాలను మరింత మందికి సరసమైన ధరకు అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని హిండ్‌వేర్ లిమిటెడ్ బాత్ అండ్ టైల్స్ సిఇఒ సుధాంశుపోఖ్రియాల్ పేర్కొన్నారు.

హిండ్‌వేర్ నుంచి ఆక్వా ప్రో వాటర్ సేవింగ్ సొల్యూషన్స్

న్యూఢిల్లీ : ప్రముఖ బాత్‌వేర్ బ్రాండ్ అయిన హిండ్‌వేర్ 'ఆక్వా ప్రో వాటర్ సేవింగ్ సొల్యూషన్స్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో మూడు అధునాతన స్ప్రే మోడ్ నాజిల్‌లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. వీటితో 98 శాతం వరకు నీటిని పొదుపు చేయడానికి వీలుందని పేర్కొంది. ఈ వినూత్న పరిష్కారాలను మరింత మందికి సరసమైన ధరకు అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని హిండ్‌వేర్ లిమిటెడ్ బాత్ అండ్ టైల్స్ సిఇఒ సుధాంశుపోఖ్రియాల్ పేర్కొన్నారు.

జొమాటోకు రూ.184 కోట్ల పన్ను నోటీసులు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక జొమాటోకు రూ.184 కోట్ల పన్ను నోటీసులు జారీ అయ్యాయి. సర్వీస్ ట్యాక్స్, జరిమానా కలిపి చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నుంచి తమకు ట్యాక్స్ డిమాండ్ నోటీసు అందిందని జొమాటో రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. విదేశీ అనుబంధ సంస్థలు, దేశం వెలుపల ఉన్న శాఖల్లో 2014 అక్టోబర్ నుంచి 2017 జూన్ మధ్య జరిగిన విక్రయాలపై సర్వీస్ ట్యాక్స్ చెల్లించలేదని ఢిల్లీ సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ ఏప్రిల్ 1న డిమాండ్ నోటీసు పంపించినట్లు జొమాటో తెలిపింది.